జెండా బాలాజీ జాతర ప్రారంభం

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 4 : జిల్లాకేంద్రంలోని జెండా బాలాజీ జాతర బుధవారం ప్రారంభమైంది. పెద్దబజార్‌లోని వంశపారంపర్య పూజారి అజయ్ సంగ్వాయి ఇంటి నుంచి జెండా, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి, ఊరేగింపుగా తీసుకువచ్చి జెండా గుడిలో పూజలు చేశారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు వేదిక వద్ద జెండాను ప్రతిష్ఠించారు. ఈనెల 18 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో గింజుపల్లి వేణు తెలిపారు.

అయ్యప్ప ఆలయానికి రూ.1.21 లక్షల విరాళం

కోటగిరి, సెప్టెంబర్ 4 : మండలకేంద్రంలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయానికి కోటగిరికి చెందిన మాశెట్టి నర్సయ్య రూ.లక్షా 21 వేలు బుధవారం విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ నిర్వాహకుడు పోల విఠల్‌రావు గుప్తాకు విరాళం అందజేశారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

కోటగిరి, సెప్టెంబర్ 4 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చిస్తామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం కోటగిరి హైస్కూల్ ఆవరణలో మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించి మాట్లాడారు. వరదల నేపథ్యంలో సీఎం సహాయనిధికి ఉపాధ్యాయుల ఒకరోజు వేతనాన్ని పీఆర్టీయూశాఖ ద్వారా అందజేయనున్నట్లు తెలిపారు.

7న వినాయక చవితి

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 4 : వినాయక నవరాత్రి ఉత్సవాలు ఈనెల 7న ప్రారంభమవుతాయని సార్వజనిక్ గణేశ్ మండలి అధ్యక్షుడు బంటు గణేశ్ బుధవారం ఒక ప్రకటనలో లిపారు. 7న ఉదయం 9.30 గంటలకు రైల్వేగేట్ సార్వజనిక్ గణేశ్ మండలిలో గణేశ్ దీక్ష, సామూహిక గణేశ్ చాలీసా పారాయణం, 10న దుర్వార్చన పూజ, 14న సత్య గణపతి వ్రతం, 15న సుందరకాండ పారాయణం, 16న చప్పన్‌భోగ్ నివేదన, 17న నిమజ్జన రథోత్సవం ఉంటాయని వివరించారు.

కమిషనరేట్‌లో ఇద్దరు సీఐల బదిలీ

వినాయక్‌నగర్/ శక్కర్‌నగర్, సెప్టెంబర్ 4 : నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సీఐలను తాత్కాలికంగా బదిలీ చేస్తూ సీపీ కల్మేశ్వర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న వి.వెంకటనారాయణను బోధన్ టౌన్ అటాచ్డ్ ఎస్‌హెచ్‌వోగా ట్రాన్స్‌ఫర్ చేశారు. బోధన్ టౌన్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.వీరయ్యను నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు అటాచ్డ్ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అర్ధరాత్రి మున్సిపల్ కమిషనర్ పర్యటన

డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న నగర కమిషనర్ మకరంద్

కంఠేశ్వర్, సెప్టెంబర్ 4 : నగరంలో పారిశుద్ధ్య వ్యవస్థపై కమిషనర్ మకరంద్ ప్రత్యేక దృష్టిసారించారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వివిధ డివిజన్లలో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. డివిజన్ల వారీగా సమస్యలు తెలుసుకొని, పరిష్కరించాలని సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. భారీ వర్షాలతో రోడ్లపై, డ్రైనేజీల్లో నీరు నిల్వకుండా చర్యలు చేపడుతున్నారు. మంగళవారం అర్ధరాత్రి పలు డివిజన్లలో డంపింగ్ యార్డులను పరిశీలించారు. అర్ధరాత్రి కురిసిన భారీ వర్షాలకు మాణిక్‌బండార్, ఖానాపూర్ ప్రాంతాల్లో నిలిచిన నీటిని పరిశీలించి.. స్థానికులతో మాట్లాడారు. బుధవారం రాత్రి గూపన్‌పల్లిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని నగరపాలక కమిషనర్ మకరంద్ పరిశీలించి, వసతుల గురించి తెలుసుకున్నారు.

ఇంటర్ ఫస్టియర్‌లో చేరేందుకు స్పాట్ కౌన్సెలింగ్

ఖిల్లీవాడి, సెప్టెంబర్ 4 : మోపాల్ మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ (ఇంగ్లిష్ మీడియం)లో చేరేందుకు ఈనెల 5,6వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ విజయలలిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ (1), బీసీ (1), ఓసీ (1) మిగులు సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు.

శాంతి కమిటీ సమావేశాలు

కోటగిరి/డిచ్‌పల్లి/ఎడపల్లి, సెప్టెంబర్ 4 : గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబీ పండుగలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచిస్తూ జిల్లాలోని వివిధ మండలాల్లో పోలీసులు మండపాల నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. రుద్రూర్ రైతువేదికలో ఏసీపీ శ్రీనివాస్ సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు. సమావేశంలో సీఐ జయేశ్‌రెడ్డి, ఎస్సై సాయన్న, విద్యుత్ ఏఈ శ్రీనివాస్, రామాలయ కమిటీ అధ్యక్షుడు పత్తి రాము పాల్గొన్నారు. కోటగిరి పోలీస్‌స్టేషన్ ఆవరణలో రుద్రూర్ సీఐ జయేశ్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ హనుమంతు, ఎస్సై సందీప్, ఏఎస్సై శ్రీనివాస్ గౌడ్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ కృష్ణ, పవన్ పాల్గొన్నారు. డిచ్‌పల్లిలో సీఐ మల్లేశ్, ఎస్సై మహ్మద్ షరీఫ్ సమావేశం నిర్వహించారు. ఎడపల్లి, మండలంలోని వివిధ గ్రామాల యువకులు, వినాయక మండపాల నిర్వాహకులతో ఏసీపీ శ్రీనివాస్, సీఐ నరేశ్, ఎస్సై వంశీకృష్ణారెడ్డి సమావేశం నిర్వహించారు.

శ్రీరాంసాగర్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో ప్రజలు బుధవారం తరలివచ్చారు. ప్రాజెక్టుపై ఫొటోలు దిగారు. – ముప్కాల్, సెప్టెంబర్ 4

దంచి కొట్టిన వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పలు చోట్ల కూలిన ఇండ్లు
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు.. నిలిచిపోయిన రాకపోకలు

వేల్పూర్ మండల అంక్సాపూర్ నుంచి పోచంపల్లికి వెళ్లే రోడ్డుపై నుంచి పారుతున్న నీరు

ఆటోనగర్‌లో నిలిచిన వర్షపు నీరు

ఖానాపూర్‌లో ఓ కాలనీలో నిలిచిన వర్షపు నీరు

రేడియో స్టేషన్‌లో ఇండ్ల మధ్య ..

శక్కర్‌నగర్‌లో వర్షానికి కూలిన ఇంటి ప్రాంతాన్ని పరిశుభ్రం చేయిస్తున్న మున్సిపల్ అధికారులు

నందిగామ- బినోలా రోడ్డుపై నుంచి పారుతున్న వరద నీరు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, సెప్టెంబర్ 4 : జిల్లావ్యాప్తంగా ఐదు రోజులుగా వర్షం కురుస్తున్నది. మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. చెరువులు నిండి, అలుగులు పారుతున్నాయి. పలుచోట్ల పురాతన ఇండ్లు కూలాయి. పంటలు దెబ్బతిన్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు పర్యటించి, సిబ్బందికి సూచనలు చేశారు.

నగరంలోని నెహ్రూ పార్క్ ప్రాంతంలో ఒలింపియా బేకరీ పక్కన ఉన్న పురాతన ఇల్లు కూలింది. మోస్రా మండలంలోని చే నంబర్ తండాలో జ్యోతిబాయి ఇల్లు కూలిపోయింది. జ్యోతిబాయి కుటుంబాన్ని అధికారులు ముందే పునరావాస కేంద్రాలకు పంపడంతో పెను ప్రమాదం తప్పింది. ధర్పల్లి మండలం వాడి గ్రామం వద్ద నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పక్కన తాత్కాలికంగా నిర్మించిన వంతెన.. వాగు నీటి ఉధృతికి ఇటీవల కొట్టుకుపోయింది. ఐదు రోజులుగా వాడి, హోన్నాజీపేట్ గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ధర్పల్లి మండలంలోని పెద్దచెరువు పూర్తిగా నిండి భారీగా అలుగు ప్రవహిస్తున్నది బద్దోడి మామ్లుళ్ల వద్ద కల్వర్టుపై నుంచి వరద ఉధృతంగాప్రవహిస్తుండడంతో రాకపోకలను నిలిపివేశారు. దీంతో సీతాయిపేట్ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్వర్టుపై మినీ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సిరికొండ మండలంలోని చీమన్‌పల్లిలో దెబ్బతిన్న వరి, మక్కజొన్న పంటలను రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్, ఏవో నర్సయ్య పరిశీలించారు. సుమారు 350 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. సిరికొండ మండలంలోని వివిధ గ్రామాల్లో దెబ్బతిన్న బ్రిడ్జిలు, పంట పొలాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి.. నాయకులతో కలిసి పరిశీలించారు.

ఇందల్వాయి మండలంలోని గన్నారం చెరువు అలుగు పొంగిపొర్లుతున్నది. చిన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బుధవారం తెల్లవారుజాము 3 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. నల్లవెల్లి బస్సు గ్రామశివారులో ఆగిపోయింది. ప్రవాహం తగ్గిన తర్వాత గ్రామసేవకులు, ఎస్సై రాజేశ్వర్, సిబ్బందితో ప్రయాణికులను ఒడ్డుకు చేర్చారు.

దుబ్బ నుంచి ఖానాపూర్, కాలూర్ గ్రామాలకకు వెళ్లే రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్టు గుండా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. రూరల్ పోలీసులు కల్వర్టుకు ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు.

వరద బాధితులను ఆదుకోవాలి

సిరికొండ, సెప్టెంబర్ 4 : మండలంలో వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పాక్షికంగా దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలని కోరారు. ఇండ్లు దెబ్బతిన్న వారికి ఇండ్లు కట్టించి ఇవ్వాలని, మృతిచెందిన వారికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

నిజాంసాగర్ ఆయకట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చందూర్/పొతంగల్, సెప్టెంబర్ 4 : నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లను ఎత్తిన నేపథ్యంలో ఆయకట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందూర్, పొతంగల్ తహసీల్దార్లు శాంత, మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. చందూర్, మోస్రా, మంజీరా పరీవాహక ప్రాంతాల ప్రజలు, పశువుల కాపరులు, మత్స్యకారులు తీర ప్రాంతానికి వెళ్ల వద్దని సూచించారు.

శక్కర్‌నగర్‌లో కూలిన నివాస ఇల్లు

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 4: బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో రాంబాబు అనే వ్యక్తి ఇల్లు బుధవారం తెల్లవారుజామున కూలింది. బోధన్ మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గణేశ్ కూలిన భాగాన్ని జేసీబీ ద్వారా తొలగించారు. ఇంటి పరిసరాల్లోని చెత్తను తొలగించారు. పట్టణంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతున్నామని కమిషనర్ వెంటక నారాయణ తెలిపారు.

బోధన్ డివిజన్‌లో బుధవారం ఉదయం వరకు నమోదైన వర్షపాతం వివరాలను బోధన్ గణాంక అధికారి లక్ష్మారెడ్డి వెల్లడించారు. రెంజల్ మండలంలో 90.6 మిల్లీ మీటర్లు, కోటగిరి మండలంలో 20.8, బోధన్ మండలంలో 26.4, వర్ని మండలంలో17, మోస్రా, ఎడపల్లి మండలాల్లో 40.2, రుద్రూర్ మండలంలో 31.6, చందూర్‌లో 25.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

వర్షపు నీటి తొలగింపు

ఆర్మూర్‌టౌన్,సెప్టెంబర్4: పట్టణంలోని వరద ప్రభావిత కాలనీలను మున్సిపల్ కమిషనర్ రాజు, అధికారులతో కలిసి బుధవారం సందర్శించారు. పలు కాలనీల్లో నిలిచిన వర్షపు నీటిని జేసీబీతో కాల్వలు తవ్వి తొలగించారు.

రోడ్డుపై నుంచి పారుతున్న వర్షపు నీరు..

మాక్లూర్,సెప్టెంబర్: మండలంలోని ధర్మోరా, కృష్ణానగర్, గొట్టుముక్కల, గంగరమంద వద్ద కల్వర్టులు, రోడ్లపై నుంచి వర్షం నీరు పారడంతో వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. మాక్లూర్‌లోని చింతల చెరువు, ధర్మోరా చెరువు అలుగు పారుతున్నాయి. పలు గ్రామాల్లో వరి పంటలు నీట మునిగాయి. చిల్లీ గ్రామానికి చెందిన వ్యాపని బాలమణి నివాసపు పెంకుటిల్లు కూలిపోయిందని తహసీల్దార్ శేఖర్ తెలిపారు. జీపీ కార్యాలయంలో ఆమె కుటుంబానికి పునరావాసం కల్పించినట్లు తెలిపారు. ఆర్థిక సహాయం అందించాలని ఆమె అధికారులను కోరారు. కార్యాదర్శి నవీన్ తదితరులు ఉన్నారు.

నిలిచిన రాకపోకలు

నవీపేట, సెప్టెంబర్ 4: మండలంలోని బినోలా-నందిగామ రోడ్డుపై వరద ఉధృతంగా ప్రవహిస్తున్నంది. దీంతో ఈ గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. వరద తగ్గేవరకూ ఈ మార్గంలో ఎవరూ వెళ్లవద్దని అధికారులు కోరుతున్నారు.

వరదను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

రెంజల్, సెప్టెంబర్4: కందకుర్తి గోదావరిలో వరద ఉధృతిని నిజామాబాద్ ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. నది పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రావణ్, రెంజల్ కార్యదర్శి రాజేందర్‌రావు ఉన్నారు.

ధర్మోరా వద్ద రోడ్డుపై పారుతున్న నీరు

కందకుర్తి వద్ద నదిలో వరదను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

మోస్రా మండలం చే నంబర్ తండాలో కూలిన ఇల్లు

గన్నారం వద్ద పొంగి ప్రవహిస్తున్న చిన్న వాగు

'చిన్నారి కుటుంబానికి రూ. 4 లక్షలు అందజేస్తాం'

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న షబ్బీర్ అలీ

కంఠేశ్వర్/ ఖిల్లీవాడి, సెప్టెంబర్ 4 : నగరంలోని ఆనంద్‌నగర్‌లో ఇటీవల కాలువలో గల్లంతైన అన్యన్య కుటుంబంతో పాటు వరద బాధిత కుటుంబాలను ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్‌అలీ బుధవారం పరామర్శించారు. బాలిక గల్లంతైన నాలాను పరిశీలించి, విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం తరపున రూ. 4 లక్షల అందిస్తామని హామీ ఇచ్చారు. నగరంలోని భారతీరాణి కాలనీలో అక్రమకట్టడాలను గుర్తించి ప్రభుత్వం కూల్చివేసిన స్థలాన్ని పరిశీలించారు. పేదలకు నకిలీ పట్టాలు అందజేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇండ్లు కోల్పోయిన వారికి స్థలాలతో పాటు ఇందిరమ్మ పథకం కింద రూ. 5 లక్షలు అందజేస్తామన్నారు. అనంతరం ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో అధికారులతో సమీక్షించారు. షబ్బీర్ అలీని మైనార్టీ నాయకులు, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. వరదల నేపథ్యంలో సీఎం సహాయనిధికి జిల్లా ఉద్యోగుల పక్షాన సుమారు రూ. 5 కోట్లు విరాళం అందజేసేందుకు సుముఖంగా ఉన్నామని అన్నారు.

రైతులకు నష్టం కలగకుండా చూస్తాం

బోధన్/ఎడపల్లి, సెప్టెంబర్ 4: ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా రైతులకు, మంజీరా నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని హంగర్గా గ్రామాన్ని ఆయన రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు, నాయకులతో కలిసి సందర్శించారు. పక్కనే ఉన్న మంజీరా పరివాహక ప్రాంతంలో నీటితో మునిగిన పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ఎడపల్లి, రెంజల్, నవీపేట్, బోధన్ మండలాల్లో సోయాబీన్, పొగాకు, వరి పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించామన్నారు. అధికారులతో సర్వే చేయించి రైతులకు న్యాయం చేస్తామని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ విఠల్, వ్యవసాయ శాఖ ఏడీ అలీం, ఏవో సంతోష్, నీటి పారుదల శాఖ డీఈ లోక్యానాయక్, తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, రైతులు పాల్గొన్నారు. ఎడపల్లి మండలం ఠానాకలాన్ అలీసాగర్ రిజర్వాయర్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. ముత్తకుంట బాలమ్మ వాగును పరిశీలించారు. జైతాపూర్ తదితర గ్రామాలను సందర్శించారు. రైతులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు.

న్యాక్ శిక్షణ కేంద్రం తనిఖీ

భీమ్‌గల్, సెప్టెంబర్ 4: భీమ్‌గల్ న్యాక్ శిక్షణ కేంద్రాన్ని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సీహెచ్.ప్రభుదాస్ బుధవారం తనిఖీ చేశారు. ఎలక్ట్రికల్ విభాగంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు టీ షర్ట్స్, బుక్స్, బ్యాగ్స్ అందజేశారు. టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న వారికి అప్రాన్స్ రికార్డు బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో న్యాక్ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.ప్రభాకర్, న్యాక్ భీమ్‌గల్ సెంటర్ ఇన్‌చార్జి దిలీప్‌గౌడ్, ట్రైనర్ పుష్ప, కార్మికశాఖ సిబ్బంది గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.

వరద నీటివైపు వెళ్లొద్దు

ఏర్గట్ల, సెప్టెంబర్ 4: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని తడ్‌పాకల్, దోంచండ, గుమ్మిర్యాల్ గ్రామాల శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నదితోపాటు బట్టాపూర్ శివారులో పెద్దవాగు, ఏర్గట్ల శివారులో తీగల వాగు నిండుగా పారుతున్నాయని అటువైపు ప్రజలు వెళ్లవద్దని ఎస్సై రాము అన్నారు. ఎస్సై తన సిబ్బంది, ప్రజలతో కలిసి ఆయా ప్రాంతాలను బుధవారం పరిశీలించారు.

బైక్‌పై వెంబడించి బంగారం చైన్ చోరీ

ఏర్గట్ల, సెప్టెంబర్ 4: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులను వెంబడించి మహిళ మెడలోని బంగారం చైన్ చోరీ చేసిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై రాము కథనం మేరకు.. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన ఎనుగందుల జనార్దన్ తన భార్య పద్మాబాయితో కలిసి ద్విచక్రవాహనంపై వెంచిర్యాల్ వెళ్తున్నారు. వారి వెనక నుంచి బైక్‌పై హెల్మెట్ పెట్టుకొని వచ్చిన దుండగుడు వారితో మాటలు కలిపాడు. పాలెం గ్రామానికి ఎటునుంచి వెళ్లాలని అడిగాడు. మండల కేంద్రంలోని చర్చి సమీపంలోకి రాగానే మహిళ మెడలోని 18 మాసాల బంగారం పుస్తెలతాడును లాక్కొని వెళ్లిపోయాడు. బాధితురాలి భర్త జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం షాపులో..

బాల్కొండ, సెప్టెంబర్ 4: మండలంలోని కిసాన్‌నగర్‌లో తుల్జా భవానీ వైన్స్ దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఏఎస్సై రాజేశ్వర్‌రెడ్డి కథనం మేరకు.. షాపు షట్టర్ తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించి కౌంటర్‌లోని సుమారు రూ.14 వేల నగదు ఎత్తుకెళ్లారు. షాపు యజమాని మల్లెపు రవీందర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది.

ప్రభుత్వ పాఠశాలలో..

ఎడపల్లి, సెప్టెంబర్ 4: మండలంలోని మంగళ్‌పాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం చోరీ జరిగింది. ఎస్సై వంశీకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. పాఠశాలలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కళాలు పగులగొట్టి కంప్యూటర్ ఎత్తికెళ్లారు. ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రక్షిత మృతిపై విచారణ చేపట్టాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 4 : రుద్రూర్‌లోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో మృతిచెందిన రక్షిత ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదట నిరసన తెలిపి, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆజాద్, ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బోడ అనిల్ మాటాలడుతూ.. రక్షిత మృతిపై అనుమానాలు ఉన్నాయని, కమిటీ వేసి విచారణ చేపట్టాలని, విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రిన్సిపాల్, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీపీ నేతృత్వంలో విచారణ జరిపించాలి

ఖిల్లీవాడి, సెప్టెంబర్ 4 : రక్షిత మృతిపై సీపీ నేతృత్వంలో విచారణ చేయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హాస్టల్‌లో సీసీ కెమెరాలు పని చేయకపోవడంపై అనుమానాలు ఉన్నాయని అన్నారు.

గడువు ముగిసిన సరుకుల విక్రయం

- ఐదు దుకాణాలపై కేసులు

నవీపేట, సెప్టెంబర్4: మండల కేంద్రంలోని పలు దుకాణాలపై బుధవారం తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలు పాటించని వారిపై ఐదు కేసులు నమోదు చేసినట్లు జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి మహ్మద్ సుజత్ అలీ పేర్కొన్నారు. ఆర్‌ఆర్ ట్రేడర్స్, పెయింట్స్ అండ్ ఎలక్ట్రికల్, శ్రీ భవాని సూపర్ మార్కెట్ ఎంబీ కిరాణా దుకాణాలతో దాడులు నిర్వహించామని, గడువు ముగిసిన సరుకులు విక్రయిస్తున్నందున పలు దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **పీఆర్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక** - కోటగిరి, సెప్టెంబర్ 4 : పీఆర్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని కోటగిరి హైస్కూల్‌లో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బర్ల సాయిలు, ప్రధానకార్యదర్శిగా ఉదయ్ చందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎండీ పాషా, మహిళా ఉపాధ్యక్షురాళ్లుగా సుమన, సుచిత్ర, కార్యదర్శిగా మోతిపేట రాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఇత్తెపు శంకర్, అసోసియేట్ అధ్యక్షుడు శానం సాయిలు, డివిజన్ ఇన్‌చార్జి అంబెల్లి శంకర్, ఎంఈవో నాగ్‌నాథ్, శ్రీనివాసరావు, కృష్ణ మోహన్, గంగరాజులు, లోల శంకర్ పాల్గొన్నారు.
- **రుణమాఫీ కాని రైతు కుటుంబీకుల వివరాలు నమోదు** - రుద్రూర్, సెప్టెంబర్ 4 : రేషన్ కార్డులు లేకపోవడంతో రుణమాఫీ కాని రైతు కుటుంబీకుల వివరాలను మండలకేంద్రంలోని రైతువేదికలో ఏఈవో వెంకటేశ్ బుధవారం నమోదు చేసుకున్నారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
- **కారు, ఆటో ఢీ .. ఒకరికి గాయాలు** - రుద్రూర్, సెప్టెంబర్ 4 : మండలకేంద్రంలో బుధవారం కారు, ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. వర్ని నుంచి రుద్రూర్ వైపు వస్తున్న కారు.. ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న ఒకరికి గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు.
- **వృద్ధాప్య వైద్యశిబిరం** - ధర్పల్లి, సెప్టెంబర్ 4 : మండల కేంద్రంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో వృద్ధాప్య వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా ఆయూష్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ నారాయణరావు... ధన్వంతరి విగ్రహానికి పూలమాలలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. 110 మందికి వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు మాధవి, నారాయణరావు, సిబ్బంది పురుషోత్తం, మురళి, జయరాజు తదితరులు పాల్గొన్నారు.
- **యోగా శిక్షణ శిబరం ప్రారంభం** - సారంగాపూర్, సెప్టెంబర్ 4 : మండలంలోని గుండారం గ్రామంలో ఉన్న మొట్టాడి రెడ్డి కల్యాణ మండపంలో పతంజలి యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వాహకులు ఎక్కొండ ప్రభాకర్, కిషన్ బుధవారం ప్